మందుబాబులు హల్‌చల్

- మద్యం మత్తులో ఒకరిపై ఒకరు దాడి
- తాగిన సీసాలను పగలగొట్టి పంట పొలాల్లోకి గిరాటు
- ఇబ్బందులు పడుతున్న రైతులు
- బహిరంగ మద్యపానాన్ని ప్రభుత్వం నిషేధించాలని కోరుతున్న వైనం



ఉండవల్లి సెంటర్ బస్టాండ్ వెనుక పార్కులో మద్యం తాగుతున్న మందుబాబులు

తాడేపల్లిరూరల్ : మంగళగిరి నియోజకవర్గ వ్యాప్తంగా గత కొంత కాలంగా బహిరంగ ప్రదేశాల్లో మందుబాబులు హల్‌చల్ చేస్తూ పంట పొలాల్లో తాగిన సీసాలను విసిరివేస్తూ రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. ఉండవల్లి యూటీకే లిఫ్ట్ ఇరిగేషన్ కాలువ వెంబడి రైతులు ఏర్పాటు చేసుకున్న పంపు షెడ్ల వద్ద మందుబాబులు, భామలు మద్యం తాగి మాటా మాటా పెరిగి ఒకరిపై ఒకరు దాడి చేసుకుంటున్నారు.

ఆడమగ తేడాలేదు

గతంలో ఉండవల్లి ఆంజనేయస్వామి దేవస్థానం, ఉండవల్లి దళితవాడ కట్ట మధ్యలో ఉన్న పంప్ హౌస్ వద్ద మద్యం తాగి ఆడమగ తేడా లేకుండా ఒకరిపై ఒకరు దాడిచేసుకోవడంతో ఒక మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. పంట కాలువ నీటిలో, ఒడ్డున ఎక్కడ చూసినా మద్యం సీసాలు, గాజు పెంకులు, వాటర్ ప్యాకెట్లు, గ్లాసులు కనిపిస్తున్నాయి. ప్రతి రోజు శుభ్రం చేసుకుంటున్నా మరునాడు అదే విధంగా సీసాలు, ఇతర వ్యర్థాలు వేస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బహిరంగ మద్యపానాన్ని నిషేధించాలి

- అమ్మ హోటల్ పక్కనే ప్రతి రోజు తెల్లవారుజామున మహిళలేకాక పలువురు వాకింగ్ చేసేందుకు వస్తూ ఉంటారు. ఆ రహదారిలో కూడా పంట పొలాల్లో మద్యం తాగి సీసాలను ఆ రోడ్డుపై పడవేయడంతో వాకింగ్ చేసేవారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.
- ఉండవల్లి సెంటర్ నుంచి తాడేపల్లి వెళ్లే రహదారిలో ఉన్న పార్కులో మందుబాబులు మద్యం తాగి సీసాలు, గ్లాసులు అక్కడే పడేస్తున్నారు. అక్కడే తాడేపల్లి ఊళ్లోకి వెళ్లేందుకు బస్టాండ్, ఆటోస్టాండ్ ఉన్నాయి. బస్సుల కోసం వేచి ఉన్న సమయంలో మహిళలు, విద్యార్థులను మందుబాబుల మద్యం సేవిస్తూ, తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారు.
- ఎన్‌టీఆర్ కరకట్ట నుంచి మణిపాల్ హాస్పిటల్‌కు వెళ్లే మార్గంలోను, పాత టోల్‌గేట్ ఎదురుగా ఉన్న రహదారిలో, వడ్డేశ్వరం కొలనుకొండ, గుంటూరు చానల్ ఒడ్డున, రేవేంద్రపాడు బకింగ్‌హామ్ కెనాల్ లాకుల వద్ద, దుగ్గిరాలలోని పలు కాలువల వద్ద, మంగళగిరిలోని పలు డొంక రోడ్లలో మందుబాబులు మద్యం తాగి సీసాలు పగలగొట్టి ఎక్కడపడితే అక్కడ పడేయడంతో రైతులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎక్సైజ్ శాఖ అధికారులు బహిరంగంగా మద్యం తాగే వారిపై చర్యలు తీసుకోకపోతే భవిష్యత్తులో అనర్థాలు జరిగే అవకాశం ఉందని, మద్యం సేవించే వారించాలని రైతులు ప్రయతిస్తే దాడి చేయడానికి కూడా వెనుకాడడం లేదని, రైతుల పంట పొలాలను కాపాడాలంటే బహిరంగ మద్యపానాన్ని ప్రభుత్వం నిషేధించాలని పలువురు కోరుతున్నారు.



అరటితోటలో పడవేసిన మద్యం సీసాలు

ఉదయం, సాయంత్రం తేడా లేదు



ఉదయం, సాయంత్రం తేడా లేకుండా మందుబాబులు పంట పొలాల్లో మద్యం తాగుతున్నారు. ఇక్కడ తాగుతున్నారేంటని ప్రశ్నిస్తే దురుసుగా మాట్లాడుతున్నారు. ఇటీవల 112కు కాల్ చేసి సమాచారం ఇచ్చాం. ఇదిగో పంపిస్తున్నామన్నారు కానీ ఎవరూ రాలేదు. ఒక్కోసారి మద్యం ఎక్కువై వారిలో వారు కొట్టుకుంటున్నారు. ఏదైనా జరగరానిది జరిగితే పోలీసులు సంబంధిత రైతులనే ప్రశ్నిస్తారు. ప్రభుత్వమే బహిరంగ మద్యాన్ని నిషేధించాలి.

– నందు శ్రీనివాసరావు, రైతు

వాకింగ్ చేయలేకపోతున్నాం



ఎక్కడ డొంక రోడ్లలో వాకింగ్ చేద్దామన్నా కుదరడం లేదు. ఏ రోడ్డులో చూసినా మద్యం సీసాలు, గాజు పెంకులు, వ్యర్థాలే దర్శనమిస్తున్నాయి. ప్రశాంతంగా ఉండే పంట పొలాల్లో మందుబాబుల ఆగడాలు ఎక్కువ అవుతున్నాయి. మందుబాబుల వల్ల రైతులు కూడా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఒక్కోసారి పొలంలో గాజు పెంకులు రైతుల కాళ్లలో దిగిపోతున్నాయి. బహిరంగ మద్యపానాన్ని వెంటనే నిషేధించాలి.

– ఓలేటి నగేష్

తాడికొండ ఆర్‌హెచ్‌సీలో అందుబాటులో వైద్య సేవలు



తాడికొండ: మెడికల్ కళాశాల అనుబంధంగా కొనసాగుతున్న తాడికొండ గ్రామీణ ఆరోగ్య కేంద్రంలో అన్ని రకాల వైద్య సేవలు అందుబాటులోకి తీసుకొచ్చినట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కె.విజయలక్ష్మి, వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సుందరాచారి అన్నారు. వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత పేదలకు ఉచిత సేవలు అందించేందుకు ఆరోగ్య కేంద్రంలో నూతనంగా అల్ట్రాసౌండ్ స్కానింగ్ యంత్రం, అభివృద్ధి చేసిన రక్త పరీక్షల కేంద్రాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. ప్రతి గురువారం గర్భిణులకు స్కానింగ్ సేవలు అందించబడతాయని, తాడికొండ, పరిసర ప్రాంత ప్రజలు ఉపయోగించుకోవాలన్నారు. ఆర్‌హెచ్‌సీలో అభివృద్ధి కార్యక్రమాలలో భాగంగా సివిల్, ఎలక్ట్రికల్ పనులు జరుగుతున్నాయని, ఆవరణను సుందరంగా తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు. పూర్తి స్థాయిలో సేవలందించడం జరుగుతుందని, అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆర్‌హెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ నళినీదేవి, డాక్టర్ పూర్ణమ్మ, డాక్టర్ శివగోపాల్, డాక్టర్ కృష్ణమూర్తి నాయక్, డాక్టర్ ఇన్నారావు, పొన్నెకల్లు పీహెచ్‌సీ, ఆర్‌హెచ్‌సీ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

జీవిత బీమాతో ఖాతాదారులకు రక్షణ



ఫిరంగిపురం: జీవిత బీమా బ్యాంకు ఖాతాదారులకు రక్షణగా నిలుస్తుందని యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా బ్రాంచి మేనేజర్ వినయ్‌కుమార్ అన్నారు. మండలంలోని పొనుగుపాడు గ్రామంలో రైతు సేవా కేంద్రంలో మంగళవారం రిజర్వు బ్యాంకు సౌజన్యంతో ల్యాంప్ సేవా సంస్థ ఆధ్వర్యంలో బ్యాంకు లావాదేవీలపై ఖాతాదారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వినయ్ కుమార్ మాట్లాడుతూ మానవ జీవితానికి రక్షణగా పీఎం జీవన్‌జ్యోతి, పీఎం సురక్ష వంటివి నిలుస్తాయని చెప్పారు. ఖాతాదారు రూ.20 చెల్లిస్తే రూ.2 లక్షల బీమా వర్తిస్తుందన్నారు. ల్యాంప్ సంస్థ డైరెక్టర్ సాల్మన్‌పాల్ మాట్లాడుతూ బ్యాంకు సేవలు సక్రమంగా వినియోగించుకుంటే వ్యాపార రంగంలో అభివృద్ధిని సాధించుతారని చెప్పారు. మహిళలు వ్యాపార రంగంలో అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. అనంతరం రిజర్వు బ్యాంకు సేవలు తెలిపే పుస్తకాన్ని ప్రదర్శించారు. కార్యక్రమంలో వెలుగు కో ఆర్డినేటర్ డి.ద్వారక, పారిశ్రామికవేత్త వి.భాస్కర్, కె.వెంకటేశ్వరరావు, బాజీ, తురకా మంగయ్య, యానిమేటర్లు, రైతులు, ఖాతాదారులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనులు పరిశీలించిన జెడ్పీ సీఈవో



తాడికొండ: మండలంలో జిల్లా పరిషత్ సీఈవో జ్యోతి బసు ఆకస్మికంగా పర్యటించారు. ఈ సందర్భంగా పొన్నెకల్లు, తాడికొండ గ్రామాల్లో ఇంటింటి తడి, పొడి చెత్త సేకరణను పరిశీలించిన ఆయన పారిశుద్ధ్య కార్యక్రమాలు జరుగుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్‌లో నమోదు చేస్తున్న తీరును పరిశీలించి, గ్రామాల్లో సంపూర్ణ పారిశుద్ధ్యంపై దృష్టి సారించాలన్నారు. ఇంటింటి చెత్త సేకరణ ద్వారా గ్రామాల్లో పారిశుద్ధ్యం మరింత మెరుగుపడుతుందని, ప్రజలకు దీనిపై అవగాహన కల్పించి విడివిడిగా చెత్తను అందించేలా అలవాటు చేయాలన్నారు. అనంతరం సేకరణపై ప్రజలతో మాట్లాడి.. చెత్తను సేకరిస్తున్నారా లేదా దీని వలన ప్రయోజనంగా ఉందా అని అడిగారు. ఆయన వెంట ఎంపీడీవో కె.సమతావాణి, ఈవోఆర్డీ శివలీల, కార్యదర్శులు రమణయ్య, జానీ పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికుల శ్రమను దోపిడీ చేస్తున్నారు



మంగళగిరి: పారిశుద్ధ్య కార్మికుల శ్రమను టీడీపీకి చెందిన కాంట్రాక్టర్ దోచుకుంటున్నారని సీఐటీయూ జిల్లా నాయకులు ఎం.రవి విమర్శించారు. కార్మికులకు రూ.15 వేల జీతాన్ని మున్సిపాల్టి ఇస్తుంటే.. రూ.10 వేలు మాత్రమే కార్మికులకు ఇచ్చి రూ.5 వేలు కాంట్రాక్టర్ దోచుకుంటున్నారన్నారు. మంత్రి నారా లోకేష్ నియోజకవర్గంలోనే చాలీచాలని జీతాలతో కార్మికులు బతుకుతున్నారని, వారినే దోచుకుంటున్నారంటే ఇక మిగిలిన విభాగాలలో ఎంత అవినీతి జరుగుతుందో ప్రజలు తెలుసుకుంటున్నారన్నారు. కార్మికుల శ్రమను దోపిడీ చేయడంపై మంగళవారం మంగళగిరి మున్సిపల్ కార్యాలయం ఎదుట కార్మికులు మోకాళ్లపై నిలబడి నిరసన వ్యక్తం చేశారు. కార్పొరేషన్, ఇంజనీరింగ్ అధికారుల దృష్టికి ఎన్నిసార్లు తీసుకెళ్లినా వినతిపత్రాలు అందజేసినా స్పందించడం లేదన్నారు. ఇప్పటికైనా మంత్రి నారా లోకేష్ జోక్యం చేసుకుని కార్మికులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎం.బాలాజీ, నారాయణమ్మ, రజని, పుణ్యవతి తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ చెల్లింపులపై అవగాహన



తాడేపల్లి రూరల్ : డిజిటల్ చెల్లింపులపై విద్యార్థి దశ నుంచి అవగాహన పెంచుకోవాలని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సోషల్ ట్రాన్స్‌ఫర్మేషన్ డైరెక్టర్ వి.ఆంజనేయులు తెలిపారు. మంగళవారం తాడేపల్లి పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు డిజిటల్ చెల్లింపులపై అవగాహన కల్పించారు. బ్యాంక్ అకౌంట్‌లు, చెల్లింపులు, ఆన్‌లైన్‌లో మోసాలు కట్టడి చేయడం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మేనేజర్ వి.అశోక్ కుమార్, ప్రధానోపాధ్యాయులు భీమిరెడ్డి తాతిరెడ్డి, చైతన్య, యూనియన్ బ్యాంక్ మేనేజర్లు కె.భావన, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ స్మార్ట్ మీటర్లు ఉపసంహరించుకోవాలి

విద్యుత్ ఏడీఈ కార్యాలయం ఎదుట వామపక్షాల ధర్నా

మంగళగిరి: కరెంట్ చార్జీల పేరుతో ప్రజల సొమ్ము దోచిపెట్టేందుకు ఏర్పాటు చేస్తున్న అదానీ విద్యుత్ స్మార్ట్ మీటర్లను ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు పాశం రామారావు డిమాండ్ చేశారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో స్మార్ట్ మీటర్లు బిగిస్తే స్మార్ట్ మీటర్లు ఉరితాళ్లు అంటూ టీడీపీ నాయకులు, ఆ పార్టీ పత్రికలు విమర్శించాయని, వెంటనే గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి స్మార్ట్ మీటర్లను ఆపేశారన్నారు. గత ప్రభుత్వంలో స్మార్ట్ మీటర్లను అడ్డుకున్న చంద్రబాబు అధికారంలోకి వచ్చిన అనంతరం ఎందుకు ఒప్పుకోవాల్సి వచ్చిందో ప్రజలకు సమాధానం చెప్పాలని నిలదీశారు. ఎన్నికల హామీలలో కరెంట్ చార్జీలు పెంచనన్న చంద్రబాబు అధికారంలోకి వచ్చాక మూడు సార్లు పెంచి ప్రజలపై భారం మోపారని విమర్శించారు. ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్ణయాలతో పేద ప్రజలు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. స్మార్ట్ మీటర్లు విషయంలో అదానితో చేసుకున్న ఒప్పందాన్ని రద్దు చేసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం విద్యుత్ శాఖ ఏడీఈ కె.సురేష్‌బాబును కలిసి స్మార్ట్ మీటర్లు బిగింపు వెంటనే నిలిపివేయాలయని లేదంటే ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో వామపక్ష నాయకులు చిన్ని తిరుపతయ్య, అన్నవరపు ప్రభాకర్, నందం బ్రహ్మేశ్వరరావు, జాలాది జాన్‌బాబు, పిల్లలమర్రి నాగేశ్వరరావు, బత్తూరి మోహన్‌రావు, జొన్నాదుల భారతి, ఆకురాతి శ్రీనివాసరావు, జేవి రాఘవులు, ఎస్ఎస్ చెంగయ్య, ఎం.బాలాజీ, బి.కోటేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



పట్టణంలోని ఏడీఈ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న వామపక్షాలు



ప్రచారం చేస్తున్న కార్మిక నాయకులు జెట్టి బాలరాజు

నిడమర్రులో...



నిడమర్రులో ధర్నా చేస్తున్న రాజధాని ప్రజాసంఘాల ఐక్య వేదిక

మంత్రి నారా లోకేష్ గతంలో ఇచ్చిన పిలుపులో భాగంగా అదానీ స్మార్ట్ మీటర్లను పగలగొట్టండని అన్నారు. కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి, వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘం, కార్మిక సంఘం, యువజన సంఘాల ఆధ్వర్యంలో సచివాలయం వద్ద మంగళవారం ధర్నా నిర్వహించారు. జగన్ అధికారంలో ఉన్నపుడు చంద్రబాబు రైతులకు వద్దకు వెళ్లి జగన్ విద్యుత్ రంగాన్ని ప్రైవేటు పరం చేస్తున్నారని, దానిలో భాగంగానే స్మార్ట్ మీటర్లు బిగిస్తున్నారని, విద్యుత్ చార్జీలు అధికంగా పెరుగుతాయని రెచ్చగొట్టారన్నారు. చంద్రబాబు అధికారంలోకి వచ్చాక అదే స్మార్ట్ మీటర్లు బిగిస్తే ప్రజలపై అధిక భారం పడదా అని ప్రశ్నించారు. అధికారం లేకుంటే ఒక మాట, అధికారంలో ఉంటే ఒక మాట చెప్పడం చంద్రబాబు నైజం అన్నారు.

నేడు విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద ధర్నా

దుగ్గిరాల: పేదలపై మరింత విద్యుత్ భారాలు వేయడానికి స్మార్ట్ మీటర్లు బిగుస్తున్నారని సీపీఎం కార్మిక నాయకులు జెట్టి బాలరాజు అన్నారు. మంగళవారం దుగ్గిరాల బోసుబొమ్మ సెంటర్‌లో కరపత్రాల ద్వారా ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అదానీ కంపెనీకి అప్పగించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని, ఫలితంగా ట్రూ అప్ చార్జీల పేరుతో వ్యవసాయదారులు, పేద ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గాలకు ఇస్తున్న ఉచిత విద్యుత్ రద్దవుతుందని వినియోగదారులపై భారం పడుతుందని తెలిపారు. ప్రజానీకానికి ఉరితాళ్ళుగా మారనున్న అదానీ స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాలని ప్రజా సంఘాలు, పౌరసంఘాలు ఆధ్వర్యంలో ఈ నెల 6న విద్యుత్ స్టేషన్ వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బి.అమ్మిరెడ్డి, ఏసు రత్నకోటి, జ్యోతిబాబు తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలంటూ నిరసన

ఫిరంగిపురం: విద్యుత్ స్మార్ట్ మీటర్ల ఏర్పాటును రద్దు చేయాలంటూ ప్రజాసంఘాల ఐక్యవేదిక నాయకులు మంగళవారం స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అదానీ స్మార్ట్ మీటర్లు, ట్రూ అప్ చార్జీలు రద్దు చేయాలని కోరారు. గృహాలకు స్మార్ట్ మీటర్లు బిగంచవద్దని నినాదాలు చేశారు. అనంతరం విద్యుత్ అధికారులకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు, సీఐటీయూ మండల కార్యదర్శి షేక్ మస్తాన్‌వలి, జి.వెంకటేశ్వరరావు, ఇబ్రహీం, శామ్యూల్, బాలయ్య, సునీత, ఏసులు పాల్గొన్నారు.



విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద నిరసన తెలుపుతున్న నాయకులు

టీబీ లక్షణాలు ఉన్న కేసులు గుర్తించాలి

దుగ్గిరాల: ఆశా కార్యకర్తలు ఇంటింటి సర్వే తప్పనిసరిగా నిర్వహించి టీబీ లక్షణాలు ఉన్న వారిని ముందుగా గుర్తించి వారికి చికిత్స అందించాలని తెనాలి యూనిట్ మెడికల్ టీబీ ఆఫీసర్ రమాదేవి అన్నారు. మంగళవారం దుగ్గిరాల పీహెచ్‌సీలో ఆశా డే సమావేశంలో ఆమె మాట్లాడుతూ టీబీ లక్షణాలు ఉన్న వారిని త్వరగా గుర్తించి వారి వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో దుగ్గిరాల వైద్యాధికారి అబ్దుల్ ఇజాజ్ రెహమాన్, సుబ్బారావు, లత, పి.రవికుమార్, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తెనాలి టీబీ యూనిట్ మెడికల్ అధికారి రమాదేవి

అవసరం మేరకే ఎరువులు వినియోగించాలి



కంది విత్తనాలు పంపిణీ చేస్తున్న జిల్లా వ్యవసాయాధికారి, ఏడీఏ, ఏవో



మాట్లాడుతున్న జిల్లా సబ్ డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకుడు మోహన్‌రావు

జిల్లా వ్యవసాయాధికారి ఐతా నాగేశ్వరరావు

పెదపరిమి(తాడికొండ): భూసార పరిక్షణ, సాగులో ఖర్చులు తగ్గించుకొనేందుకు విచక్షణా రహితంగా రసాయనిక ఎరువులు, పురుగు మందుల వినియోగం తగ్గించుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి ఐతా నాగేశ్వరరావు అన్నారు. తుళ్ళూరు మండలం పెదపరిమి గ్రామంలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని పత్తిలో సమగ్ర సస్యరక్షణ చర్యలు వివరించారు. రైతు సేవా కేంద్రాల ద్వారా ఎరువులు త్వరలో అందుబాటులోకి తెస్తామని మార్క్‌ఫెడ్‌లో 8000 మెట్రిక్ టన్నుల వరకు నిల్వలు ఉన్నాయని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. అన్నదాత సుఖీభవ–పీఎం కిసాన్ పథకం కింద నగదు జమకాని అర్హత ఉన్న రైతులు వ్యవసాయ సహాయకులను సంప్రదించాలన్నారు. అనంతరం మంగళగిరి ఏడీఏ శ్రీనివాసరావుతో కలిసి గట్లపై నాటుకునేందుకు వేసుకునే కంది విత్తనాలను రైతులకు అందజేశారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి పి.సంధ్యారాణి, టీడీపీ నాయకులు నూతలపాటి రామారావు, వీఏఏలు సాయి, సుష్మ, రైతులు పాల్గొన్నారు.

ఈ పంట నమోదు తప్పనిసరి

ఫిరంగిపురం: ప్రతి రైతు పత్తి పంట వేసిన తొలి రోజులోనే రైతు సేవా కేంద్రంలో ఈ పంట నమోదు తప్పనిసరిగా చేయించాలని జిల్లా సబ్ డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకుడు ఎం.మోహన్‌రావు అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. రైతులకు పంట నమోదు, ఎరువుల వాడకంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మోహన్‌రావు మాట్లాడుతూ ఈ పంట నమోదు ద్వారా పంట నష్టపోతే ప్రభుత్వం నష్ట పరిహారం చెల్లిస్తుందన్నారు. ఏవో వాసంతి మాట్లాడుతూ వ్యవసాయ శాఖ సూచనల మేరకు ఎరువులు వాడుకోవాలని చెప్పారు. అలాగే మండల కేంద్రంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఎరువులు, పురుగుమందుల డీలర్లతో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే ఎరువులు, పురుగుమందులు అమ్మాలని మోహన్‌రావు చెప్పారు. కృత్రిమంగా యూరియా కొరత సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, కేసులు నమోదు చేస్తామని తెలిపారు. ఏవో వాసంతి, విస్తరణాధికారి సుభాని, శ్రీవిద్య, ప్రశాంతి, డీలర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వ్యవసాయ విస్తరణాధికారి ప్రజ్ఞాన్‌బాబు

కౌలు రైతుల గుర్తింపు కార్డుల పొందాలి

దుగ్గిరాల: ప్రతి కౌలు రైతు తప్పనిసరిగా కౌలు సాగు హక్కు పత్రం పొందాలని వ్యవసాయ విస్తరణ అధికారి సీహెచ్ ప్రజ్ఞాన్‌బాబు తెలిపారు. మంగళవారం పెదకొండూరు, గొడవర్రు గ్రామాలలో నిర్వహించిన పొలం పిలుస్తోంది ఆయన పాల్గొని మాట్లాడుతూ రైతులు కౌలు సాగు హక్కు గుర్తింపు పత్రం పొందటం ద్వారా ప్రభుత్వం నుంచి లభించే పంట నష్ట పరిహారం, సబ్సిడీ ఎరువులు, విత్తనాలు, బ్యాంకుల నుంచి రుణాలు, పంటల బీమా తదితర సేవలు పొందటానికి వీలు కలుగుతుందని అన్నారు. వెటర్నరీ అధికారి డాక్టర్ ఎస్.సతీష్, వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

వాట్సాప్ గవర్నెన్స్ సేవలను ఉపయోగించుకోవాలి

తెనాలి అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం మన మిత్ర యాప్ ద్వారా ప్రవేశ పెట్టిన వాట్సాప్ గవర్నెన్స్ సేవలను అందరూ ఉపయోగించుకోవాలని మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ వీఎం లక్ష్మీపతిరావు పిలుపునిచ్చారు. తెనాలి పురపాలక సంఘం ఆధ్వర్యంలో మంగళవారం వాట్సాప్ గవర్నెన్స్‌పై అవగాహన ర్యాలీని నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన ర్యాలీని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. మార్కెట్ మీదుగా గాంధీ చౌక్ వరకూ ర్యాలీ కొనసాగింది. గాంధీ చౌక్‌లో మానవహారం నిర్వహించి వాట్సాప్ గవర్నెన్స్‌పై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పురపాలక సంఘం అందించే వివిధ రకాల సేవలను వాట్సాప్ ద్వారా పొందవచ్చని తెలిపారు. అవసరమైన వారు సేవలను ఉపయోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో మేనేజర్ విల్సన్ జయకర్, ఆర్‌వో రాంప్రసాద్, ఆర్పీలు, మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



ర్యాలీని ప్రారంభిస్తున్న ఇన్‌చార్జి కమిషనర్ లక్ష్మీపతిరావు

సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల ధర్నా



తాడేపల్లి రూరల్ : గత 32 సంవత్సరాలుగా ఎన్ని ప్రభుత్వాలు మారినా తాడేపల్లిలోని ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల సమస్యలు పట్టించుకోలేదని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.ప్రభాకర్‌రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. మంగళవారం సిమెంట్ కార్మికుల దీక్షలను ప్రారంభించి మాట్లాడారు. కూటమి ప్రభుత్వం కార్మికులు సమస్యల పట్ల తీవ్ర నిర్లక్ష్యం వహిస్తుందన్నారు.

తాగునీటి పైప్‌లైన్‌కు మరమ్మతులు

అమర్తలూరు(వేమూరు): గ్రామ పంచాయతీల్లో పైప్‌లైన్‌లకు లీక్‌ల మరమ్మతులు చేశామని డిప్యూటీ ఎంపీడీవో జొన్నలగడ్డ వినయబాబు తెలిపారు. అమర్తలూరు గ్రామ పంచాయతీ తాగు నీరు పైపు లైను లీక్ కావడంతో మంగళవారం మరమ్మతులు చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు. గ్రామ పంచాయతీ పరిధిలో పైపు లైనులు లీక్ అయితే తమ దృష్టికి తీసుకు రావాలని ఆయన కోరారు.

పాఠశాలలో మంచినీటి కుళాయిలు ఏర్పాటు

తెనాలి: సమాజసేవలో నిర్దిష్టమైన కార్యాచరణతో ముందుకు వెళుతున్న సాయి మంగా వెల్ఫేర్ సొసైటీ, వాసవి క్లబ్ సభ్యులు అభినందనీయులని మండల తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ అన్నారు. ఆయా సంస్థల స్థానిక నరేంద్రదేవ్ కాలనీలోని మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన పైపులైన్, కుళాయిలు, సింకులను మంగళవారం తహసీల్దార్ ప్రారంభించారు. సాయి మంగా వెల్ఫేర్ సొసైటీ, వాసవి క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు కంకిపాటి రమేష్‌కుమార్, బి.సుధాకర్, ఆలపాటి కామేశ్వరరావు, డి.సత్యనారాయణ, ఏవీ సాంబశివరావు, ఓ.మార్కండేయులు, రామకృష్ణారెడ్డి, మణికాంత్, అబ్దుల్ హకీమ్ జానీ, ఆలపాటి శివకుమార్, వెచ్చా నాగరాజురావు, మాడ సుబ్బారావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'మార్పు' లఘుచిత్రం షూటింగ్ ప్రారంభం

తెనాలి: తక్కువ సమయంలో తక్కువ బడ్జెట్‌తో పెద్ద సందేశాన్ని అందించే లఘు చిత్రాలు నేటి వేగవంతమైన జీవితాలకు ఎంతైనా అవసరం అని స్వరలయ వేదిక వ్యవస్థాపకుడు, విశ్రాంత బ్యాంకు అధికారి సాయి లక్కరాజు అన్నారు. స్థానిక బాలాజీరావుపేటలో అరుణా ప్రొడక్షన్స్ పతాకంపై హరిబాబు నిర్మిస్తున్న 'మార్పు' లఘు చిత్రం తొలి షాట్‌కు మంగళవారం సాయి లక్కరాజు దర్శకత్వం వహించి క్లాప్ నిచ్చారు. సందేశాత్మకమైన కథలతో నిర్మించే లఘుచిత్రాలు నేటి ప్రపంచానికి అవసరమన్నారు. కృష్ణకిషోర్ అందించిన కథను వెంకీ దర్శకత్వంలో తీస్తున్న ఈ చిత్రం షూటింగ్‌లో నటీనటులు ప్రియాంక, స్వీటీ, సైదులు, శాంతి, లక్ష్మణరాజు, అరుణకుమారి తదితరులు పాల్గొన్నారు. రెండు రోజుల పాటు తెనాలి, పరిసరాల్లో చిత్రీకరించి ఇదే నెలలో విడుదల చేస్తామని నిర్వాహకులు తెలిపారు.

కేఎల్‌యులో ప్రాజెక్టులు, స్టార్టప్‌లపై అవగాహన

తాడేపల్లి రూరల్: ప్రాజెక్టులు, స్టార్టప్‌లపై విద్యార్థులు అవగాహన పెంచుకుని వాటిలో రాణించి అభివృద్ధి చెందాలని బహుళ బాండ్ల స్థాపకురాలు మహిళా అభివృద్ధి కోచ్ స్విత డి ఆర్యా తెలిపారు. మంగళవారం తాడేపల్లి వడ్డేశ్వరంలోని కేఎల్ యూనివర్సిటీలో ప్రాజెక్టులు, స్టార్టప్‌లపై నిర్వహించిన అవగాహన సదస్సులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్టార్టప్‌ల ద్వారా తాను ఎంతో అభివృద్ధి చెందానని వివరించారు. కార్యక్రమంలో ప్రో వీసీ డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ వెంకట్రామ్, డాక్టర్ రాజశేఖర్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, విద్యార్థి సంక్షేమ విభాగం డీన్ కేఆర్ఎస్ ప్రసాద్ పాల్గొన్నారు.

సర్వే వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి

తెనాలి అర్బన్: టీబీ ముక్తా భారత్ అభియాన్‌కు సంబంధించిన సర్వేను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని టీబీ యూనిట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సుభాష్ రమాదేవి సూచించారు. ఇంటెన్సిఫైడ్ ప్రోగ్రాంలో భాగంగా గంగానమ్మపేటలోని అర్బన్ హెల్త్ సెంటర్, కొలకలూరులోని పీహెచ్‌సీలో మంగళవారం సమావేశం నిర్వహించారు. సర్వే విధి విధానాలను తెలియజేశారు. డాక్టర్ దిలీప్ కుమార్, ఎంపీహెచ్‌వోలు రాజయ్య, వెంకటరెడ్డి, టీబీ యూనిట్ సూపర్‌వైజర్ పాల్గొన్నారు.